క్లుప్తంగా

డ్రాప్అవుట్ విద్యార్థుల గుర్తింపు


డ్రాప్ అవుట్ విద్యార్థులతో హెచ్ఎం చిన్నమ్మాయి, దుర్గాప్రసాద్ తదితరులు

సింహాచలం: పెందుర్తి రెల్లికాలనీలో ఆదివారం గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ సర్వే నిర్వహించారు. వలంటీర్ల ద్వారా నీలపు సాయి(15), దల యిచిన ఎర్రినాయుడు అనే డ్రాప్ అవుట్ విద్యార్థులను గుర్తించి వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఇద్దరినీ పదోతరగతిలో చేర్పించేందుకు ఒప్పించారు. కార్యక్రమంలో పెందుర్తి హైస్కూల్ హెచ్ఎం సీహెచ్.చిన్నమ్మాయి, రెల్లి కాలనీ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వై.సూర్యనారాయణ, క్లస్టర్ రిజర్వ్ మొబైల్ టీచర్ జి.దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

చంద్రబాబును నమ్మవద్దు

● ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్


కార్యక్రమంలో మాట్లాడుతున్న కేఏ పాల్

మల్కాపురం: మల్కాపురం: రాష్ట్రంలో ఎవరినైనా నమ్మవచ్చు గానీ.. చంద్రబాబును నమ్మి ప్రజలు మోసపోవద్దని ప్రజా శాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ అన్నారు. 60వ వార్డు గుల్లలపాలెం వుడాకాలనీ మైదానంలో ఆదివారం సాయంత్రం కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజన్ ఉన్న వ్యక్తి చంద్రబాబు అని అందరి మాదిరిగానే తానూ నమ్మానన్నారు. చివరకు ఆయనకు ఉన్నది రాష్ట్రాన్ని అభివృద్ధి చేసే విజన్ కాదని, డబ్బు సంపాదనలో విజన్ ఉందని విమర్శించారు. బాబు తన పాలనలో వందలాది కోట్ల రూపాయిలు దోచుకున్నాడు.. మళ్లీ దోచుకోవాలన్న ఆలోచనతో వృద్ధాప్యంలో కూడా తన కుమారుడు లోకేష్‌ను ముఖ్యమంత్రి చేయాలని ఆరాటపడుతున్నారని ఎద్దేవా చేశారు. ప్రజలకు మంచి చేయాలన్న వారు ఎవరైనా తనతో కలిసి వస్తే తమ పార్టీలోకి స్వాగతిస్తామన్నారు. రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు మంచి జరగాలంటే వచ్చే ఎన్నికల్లో ప్రజలు తమను ఆశీర్వదించాలన్నారు. ఈ సందర్భంగా పలువురు యువకులు పార్టీలో చేరారు.వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు.

ఖైదీలకు వైద్య పరీక్షలు


ఖైదీలకు వైద్య సేవలు అందిస్తున్న ఏఎంసీ, డీవీఎల్ విభాగం వైద్య సిబ్బంది


ఆరిలోవ: విశాఖ కేంద్ర కారాగారంలో ఆంధ్ర మెడికల్ కళాశాల(ఏఎంసీ) డీవీఎల్ విభాగం వైద్యులు ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఇక్కడ ఖైదీలకు చర్మ వ్యాధులపై అవగాహన కల్పించారు. 500 మంది ఖైదీలకు స్క్రీనింగ్ పరీక్షలు చేసి, వారిలో సుమారు 200 మందికి వివిధ రకాల మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ సివిల్ సర్జన్ స్పెషలిస్ట్ డాక్టర్ పి.గురుప్రసాద్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ప్రభాత్, కారాగారం పర్యవేక్షణాధికారి ఎస్.కిశోర్‌కుమార్, అదనపు పర్యవేక్షణాధికారి ఎం.వెంకటేశ్వర్లు, ఉప పర్యవేక్షణాధికారి పి.ఎస్.రామచంద్రరావు, ఎస్.కమలాకర్, జైలు వైద్యురాలు ఈశ్వరిదేవి పాల్గొన్నారు.

లక్ష్య సాధనకు నిరంతర కృషి

మురళీనగర్: లక్ష్యం నిర్దేశించుకోవడంతోపాటు దాన్ని చేరుకోవడానికి నిరంతరం కృషి చేయాలని మోటివేషనల్ స్పీకర్ సునీతామూర్తి రామవరపు అన్నారు. కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీలో గైస్, ఐఎస్‌టీడీ సంయుక్తంగా ఆదివారం నిర్వహించిన 'విజయం వైపు పయనం' కార్యక్రమంలో ఆమె ప్రసంగించారు. విద్యార్థులు తాము ఎంచుకున్న రంగంలో రాణించాలంటే సబ్జెక్టుపై పట్టు సాధించడంతోపాటు కమ్యూనికేషన్ స్కిల్స్ పెంచుకోవాలని సూచించారు. గైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఐఎస్‌టీడీ వైజాగ్ చాప్టర్ చైర్మన్ డాక్టర్ వోఆర్ఎం రావ్, కాలేజీ ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు.

చేరువలో ఫైబర్ నెట్ !

- నెట్ వర్క్ విస్తరణపై దృష్టి
- అవసరమైన పరికరాలు సిద్ధం
- నాణ్యమైన సేవలందించడమే లక్ష్యం



ఏపీఎస్ఎఫ్ఎల్ లోగో

సబ్బవరం: వినియోగదారులకు ఫైబర్ నెట్(ఏపీఎస్ఎఫ్ఎల్) సేవలు మరింత చేరువ కానున్నాయి. ఇకపై గ్రామ సచివాలయాల నుంచి వినియోగదారులకు నిరంతరాయంగా సేవలు అందించేందుకు రంగం సిద్ధం చేశారు. ఈ నెల చివరినాటికి ఆపరేటర్లకు పూర్తి స్థాయిలో సర్వీసులు అందుబాటులోకి తీసుకురానున్నారు. దీనిలో భాగంగా ఇప్పటికే ఆయా సచివాలయాల్లో వినియోగదారుల అవసరానికి తగ్గట్టుగా ఓఎల్టీలను ఏర్పాటు చేశారు.అవసరానికి అనుగుణంగా మరిన్ని ఓఎల్టీలను ఏర్పాటు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని ఫైబర్‌నెట్ అధికారులు చెబుతున్నారు.



సచివాలయంలో సిద్ధం చేసిన పరికరాలు

ఇదీ పరిస్థితి

ప్రస్తుతం ఉమ్మడి విశాఖ జిల్లాలో 92,380 ఫైబర్ నెట్ కనెక్షన్లు ఉన్నాయి. హై ప్రయార్టీ మండలాలుగా అనకాపల్లి జిల్లా పరిధిలోని సబ్బవరం,అనకాపల్లి, బుచ్చెయ్యపేట,కె. కోటపాడు,చీడికాడ,చోడవరం, వి. మాడుగుల, దేవరాపల్లి మండలాలను ఎంపిక చేశారు. అలాగే విశాఖ అర్బన్ పరిధిలోని పద్మనాభం ,భీమునిపట్నం,ఆనందపురం మండలాలను ఎంపిక చేశారు. ఆయా మండలాల్లోని మేజర్ సచివాలయాల్లో ఇప్పటికే కేబుల్ ఇన్‌పుట్ అందించడంతో పాటు ఓఎల్టీలను సిద్ధం చేశారు. అక్కడ నుంచి నేరుగా ఆపరేటర్ల ద్వారా వినియోగదారులకు సేవలు అందించనున్నారు. ప్రస్తుత కనెక్షన్లతో పాటు అదనంగా మరో 1,35,168 కనెక్షన్లు ఇచ్చేందుకు ఓఎల్టీలను సచివాలయాల్లో అందుబాటులో ఉంచారు.

నూతన సర్వీసులకు భారీగా రిజిస్ట్రేషన్లు

ఇటీవల విశాఖలో నిర్వహించి కేబుల్ ఎక్స్‌పో తర్వాత అధిక సంఖ్యలో కొత్త ఆపరేటర్లు ఏపీఎస్ఎఫ్ఎల్ సర్వీసుల కోసం రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. ఉమ్మడి విశాఖ జిల్లా నుంచి 200కు పైగా ఆపరేటర్లు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు.

ఆసక్తి ఉన్నవారికి అవకాశం

ఆసక్తి కలిగిన ఆపరేటర్లు రిజిస్ట్రేషన్ చేసుకోవడంతో పాటు సిగ్నల్ తీసుకునేందు విశాఖలోని ఏపీఎఫ్ఎల్ మార్కెట్ మేనేజర్‌ను 91213 36975 నంబరులో గాని నేరుగా కార్యాలయంలో సంప్రదించవచ్చు.

తక్కువ ధరకే ట్రిపుల్ ప్లే...

తక్కువ ధరకే ట్రిపుల్ ప్లే (టీవీ,నెట్,ఫోన్) సర్వీసులను వినియోగాదారులకు నిరంతరాయంగా అందిస్తుంది. వీటితో పాటు కొత్తగా ఫస్ట్ డే ఫస్ట్ షో కార్యక్రమాన్ని అందుబాటులోకి తీసుకువచ్చి వినియోగదారులకు సినిమా ప్రపంచాన్ని దగ్గర చేసింది. దీంతో చిన్న చిన్న ప్రొడ్యూసర్లు తీసిన కొత్త సినిమాలకు థియేటర్లు దొరక్క చాలా ఇబ్బంది పడుతున్నారు. అలాంటి వారికి ఏపీఎస్ఎఫ్ఎల్ ఒక ప్లాట్‌ఫాంను సిద్ధం చేసింది. ఇందులో ఫస్ట్ డే ఫస్ట్ షో ద్వారా చిన్న ప్రొడ్యూసర్లు వారు తీసిన కొత్త సినిమాను నేరుగా వినియోగదారులకు ఏపీ ఫైబర్ నెట్ ద్వారా ప్రదర్శించే అవకాశం ఉంటుంది. ఇప్పటికే పలు చిత్రాలు రిలీజ్ చేశారు.వీటికి వినియోగదారుల నుంచి మంచి స్పందన లభించింది. ఏపీఎస్ఎఫ్ఎల్ వినియోగదారులు ఇంట్లో నుంచే కొత్త సినిమా చేసే అవకాశం లభిస్తుంది.

సంక్షేమం.. అభివృద్ధి రెండు కళ్లు


నరవలో స్థానికులకు ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్

సింహాచలం: ప్రజా సంక్షేమం, రాష్ట్రాభివృద్ధి రెండుకళ్లుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన చేస్తున్నారని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. జీవీఎంసీ 88వ వార్డు నరవలో ఆదివారం ఎమ్మెల్యే అదీప్‌రాజ్ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి నాలుగేళ్లుగా అందించిన సంక్షేమ పథకాలను వివరించారు. అర్హులై ఉండి ఎవరికైనా సంక్షేమ పథకం అందకపోతే వారికీ కూడా వచ్చేలా చేస్తామన్నారు. ఈమేరకు సచివాలయ సిబ్బందికి పలు సూచనలు చేశారు. స్థానికులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో పలువురు అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఉన్నారని వారి కుటుంబాలకు సంక్షేమ పథకాలు అందట్లేదని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఈవిషయంపై పరిశీలన చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. ఈ సందర్భంగా అదీప్‌రాజ్ మట్లాడుతూ రాష్ట్రంలో ప్రజలు ఎంతో సంతోషంగా ఉన్నారన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న నవరత్నాలతో పాటు అనేక పథకాలు తమకు అందుతున్నాయని ఆనందం వ్యక్తం చేస్తున్నారన్నారు. నాలుగేళ్లలో తాము చేసిన అభివృద్ధి, అందించిన పథకాల వల్ల నేడు ప్రతీ ఇంటికి ధైర్యంగా వెళ్తున్నామని చెప్పారు. అవినీతికి తావులేకుండా, పార్టీలకతీతంగాను సంక్షేమ పథకాలు అందించడంతో ప్రజల్లో మరింత ఆదరణ పెరిగిందన్నారు. వలంటీర్ వ్యవస్థ ద్వారా ఇంటికే సంక్షేమ పథకాలు అందేలా చేయడం జరిగిందన్నారు. అవ్వా తాతలు రోజుల తరబడి కార్యాలయాల చుట్టూ పింఛన్ కోసం తిరగకుండా వాళ్ల వద్దకే పింఛన్ చేరేలా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేశారన్నారు. విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారన్నారు. జగన్‌మోహన్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో మళ్లీ గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో 88వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి గంరెడ్డి మహాలక్ష్మినాయుడు, పార్టీ సీనియర్ నాయకులు దాడి నూకరాజు, మళ్ల నూక అప్పారావు, స్వామి నాయుడు, అధికారులు పాల్గొన్నారు.

అలంకారప్రాయంగా ఆర్వో ప్లాంట్లు!


మరమ్మతులతో మూలకు చేరిన కలపాక ఆర్వో ప్లాంటు


మూతపడిన దేశపాత్రునిపాలెం ఆర్వో ప్లాంటు

- నిర్వహణలేక మూతపడిన వైనం
- తాగునీటికి ప్రైవేటు ప్లాంట్లే దిక్కు

పరవాడ: సింహాద్రి ఎన్టీపీసీ సౌజన్యంతో మండంలోని కలపాక, దేశపాత్రునిపాలెం, వాడచీపురుపల్లి గ్రామాల్లో ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేశారు. తొలినాళ్లలో బాగా ఉపయోగపడినా.. నిర్వహణ లేక మరమ్మతులతో ప్లాంట్లు మూలకు చేరడంతో ప్రజలు తాగునీటికి కష్టాలు పడుతున్నారు. మరి కొందరు ప్రైవేటు ప్లాంట్ల నుంచి క్యాన్ వాటర్ కొనుగోలు చేసుకుంటున్నారు.

ఇదీ పరిస్థితి

ఐదేళ్ల కిందట లక్షలాది రూపాయల వ్యయంతో ఈ ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేశారు. నిర్వహణ బాధ్యతను గ్రామ పంచాయతీలు తీసుకోవాల్సి ఉంది. కానీ ఆర్వో ప్లాంట్ల నిర్వహణ తలకు మించిన భారంగా మారడంతో వాటిని పట్టించుకోవడం లేదు.. కలపాకలో ఆర్వో ప్లాంటు ఏడాది పాటు సక్రమంగా సేవలందించి ఆ తర్వాత మూలకు చేరింది. దీంతో పరవాడ, వెన్నలపాలెం గ్రామాల్లోని ఆర్వో ప్లాంట్లపై ఆధారపడి దప్పిక తీర్చుకొంటున్నారు.

● జీవీఎంసీ 79 వార్డు పరిధిలోని దేశపాత్రునిపాలెం గ్రామంలో ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంటు రిపేర్లతో మూలకు చేరింది. ఏళ్ల గడుస్తున్న ప్లాంటును వినియోగంలోకి తీసుకురాకపోవడంతో స్థానికులు ప్రైవేటు ఆర్వో ప్లాంట్లపై ఆధారపడి చేతిచమురు వదిలించుకుంటున్నారు.

● వాడచీపురుపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంటు కూడా మరమ్మతులకు గురైంది. ఆర్వో ప్లాంట్లకు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

తెలుగుభాషకు గుర్తింపుపై హర్షం

సింహాచలం: ఈ నెల 29వ తేదీని ప్రధాని నరేంద్రమోదీ తెలుగు భాషా దినోత్సవంగా నిర్వహిస్తామని ప్రకటించడం సంతోషదాయకమని బీజేపీ పెందుర్తి అసెంబ్లీ నియోజకర్గ కన్వీనర్ గొర్లె రామునాయుడు అన్నారు. ప్రధాని నరేంద్రమోదీ నిర్వహించిన ఆదివారం నిర్వహించిన మన్‌కీ బాత్ ప్రసంగాన్ని పెందుర్తి బీజేపీ కార్యాలయంలో తిలకించారు. ఈ సందర్భంగా రామునాయుడు మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ తెలుగుభాషా గొప్పతనాన్ని వివరించడం విశేషమన్నారు. సంస్కృతి, విలువలు, సాంప్రదాయాలను తెలిపేదే తెలుగుభాష అని ప్రధాని కొనియాడడం అభినందనీయమన్నారు. మాతృభాషతో అనుసంధానమైతే సంస్కృతి, విలువలు, సాంప్రదాయలతో మంచి బంధం ఏర్పడుతుందని మోదీ వివరించడం జరిగిందని తెలిపారు. తెలుగు భాష వారసత్వాన్ని యావత్ దేశానికి అందించే ప్రయత్నం చేస్తామని మోదీ మన్‌కీబాత్ కార్యక్రమం ద్వారా చెప్పడం ఎంతో గర్వించదగ్గ విషయమని తెలిపారు. కార్యక్రమంలో అనకాపల్లి జిల్లా ఓబీసీ జనరల్ సెక్రటరీ ఎర్ర అచ్చంనాయుడు, పెందుర్తి మండల అధ్యక్షుడు కాళ్ల జగన్‌మోహన్, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యుత్ సర్వీసులకు ఆధార్ అనుసంధానం తప్పనిసరి

ఆనందపురం : విద్యుత్ వినియోగదారులు అందరూ తమ సర్వీసులకు ఆధార్‌ను అనుసంధానం చేసుకోవాలని మండల ఏఈఈ సురేష్ కుమార్ చెప్పారు. ఈ మేరకు ఉన్నతాధికారులు ఆదేశాలిచ్చారని వివరించారు. స్థానికంగా ఉన్న లైన్‌మేన్ వద్ద, విద్యుత్ కార్యాలయంలో, బిల్లు కలెక్టర్ వద్ద, ఈస్టర్న్ పవర్ యాప్‌లో, ఏపీఈపీడీసీఎల్ వెబ్‌సైట్‌లో ఆధార్‌ను అనుసంధానం చేసుకోవడానికి అవకాశం ఉందని తెలిపారు. వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి తమతో సహకరించాలని కోరారు.

ఉచిత కంప్యూటర్ శిక్షణకు దరఖాస్తులు

కంచరపాలెం: ఆంధ్ర బౌద్ధ సమాజ కేంద్రం నేతృత్వంలో ఉచిత కంప్యూటర్ శిక్షణ అందిస్తున్నట్లు కేంద్రం ప్రధాన కార్యదర్శి కె.రాజుగణేష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కంచరపాలెం అశోక్‌నగర్‌లోని బౌద్ధాలయంలో సెప్టెంబర్ 1 నుంచి 90 రోజుల పాటు శిక్షణ ఉంటుందని చెప్పారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈ నెల 30లోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. వివరాలకు 96760 30455 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

1 నుంచి 'శ్రీకృష్ణ కథా సప్తాహం'

సీతంపేట: లలితా పీఠాధిపతి శ్రీసిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామిచే సెప్టెంబర్ 1 నుంచి 7 వరకు శ్రీకృష్ణ కథామృత సప్తాహ ప్రవచన కార్యక్రమం జరుగుతుందని పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు. లలితానగర్‌లోని పీఠం దర్బారు హాల్లో ఆదివారం సంబంధిత కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రోజూ సాయంత్రం 6 నుంచి 8 గంటల వరకు స్వామివారు ప్రవచిస్తారని చెప్పారు. ప్రతి రోజూ ముందుగా విష్ణు సహస్ర నామ పారాయణ, శ్రీకృష్ణ పూజ జరుగుతుందన్నారు. భక్తులు ఈ మహత్తర పారాయణ. ప్రవచన కార్యక్రమంలో పాల్గొని స్వామీజీ ఆశీర్వాదం పొందాలని కోరారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు


స్వర్ణ తులసీదళాలతో ప్రదక్షిణ చేస్తున్న అర్చకుడు, భక్తులు, అధికారులు


నిత్యకల్యాణంలో అప్పన్న ఉత్సవమూర్తులు

ఘనంగా స్వర్ణతులసీ దళార్చన

సింహాచలం: ఏకాదశి పురస్కరించుకుని శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జితసేవలు విశేషంగా నిర్వహించారు. ఉదయం 7 నుంచి స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై అధిష్ఠంపజేశారు. ఉభయదాతలను స్వర్ణ తులసీదళాలతో ప్రదక్షిణ చేయించారు. స్వామి సన్నిధిలో విష్వక్సేనపూజ, పుణ్యావాచనం నిర్వహించారు. అష్టోత్తర శతనామావళి పూజ చేస్తూ 108 స్వర్ణతులసీ దళాలతో అర్చన చేశారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. ఆలయ సూపరింటిండెంట్ సునీల్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

వైభవంగా నిత్య కల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం నిత్య కల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవ మూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్ఠంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

ఆకట్టుకున్న శాస్త్రీయ నృత్య ప్రదర్శన

పీఎం పాలెం : వారాంతపు వినోద కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం 6 గంటలకు శిల్పారామం (జాతర)లో ప్రదర్శించిన శాస్త్రీయ నృత్య ప్రదర్శన ప్రేక్షకులను ఆద్యంతం అలరించింది. నగరంలోని నాట్య తరంగణి డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో మూషిక వాహన నృత్యాంశంతో ప్రదర్శన ప్రారంభమైంది. కళాకారులు విష్ణువర్ధన్ రెడ్డి, షాన్వీ, ఈశ్విత, రాణి, చంద్రాణి, మాధురి, దేదీప్య, చందు, ఇందు, మేధ, హర్షిణి, ప్రియ, భవ్య, తదితరులు పాల్గొనగా ఎస్.లీలావతి నృత్య దర్శకత్వం వహించారు.


శిల్పారామంలో శాస్త్రీయ నృత్య ప్రదర్శనలో కళాకారులు

హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్నివాల్

ఆనందపురం : హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో మండలంలోని గంభీరంలో ఉన్న హరేకృష్ణ వైకుంఠ మందిరం నిర్మాణ ప్రదేశంలో సోమవారం నుంచి విద్యార్థులకు సాంస్కృతిక కార్నివాల్ నిర్వహించనున్నామని ఆ సంస్థ అధ్యక్షుడు భక్తదాస తెలిపారు. ఈ నెల 28న 1, 2 తరగతుల విద్యార్థులకు రంగులు వేసే పోటీలు, 29న ఉదయం 5, 6, 7 తరగతుల విద్యార్థులకు స్వర సంగీతంలో, మధ్యాహ్నం 8, 9, 10 తరగతుల విద్యార్థులకు గాత్ర సంగీతంలో, 31న ఉదయం 3, 4 తరగతుల విద్యార్థులకు కలరింగ్‌లో పోటీలు ఉంటాయని చెప్పారు. అలాగే సెప్టెంబర్ 1న ఉదయం 1, 2, 3, 4 తరగతుల విద్యార్థులకు గీతా శ్లోక పఠనం, మధ్యాహ్నం 8, 9, 10 తరగతుల విద్యార్థులకు పెయింటింగ్‌లో, 2న 5, 6, 7 తరగతుల విద్యార్థులకు గీతా శ్లోకపఠనం, 3న ఉదయం 1, 2, 3, 4 తరగతుల విద్యార్థులకు పౌరాణిక వస్త్ర అలంకరణపై, మధ్యాహ్నం 8, 9, 10 తరగతుల విద్యార్థులకు గీతా శ్లోక పఠనంపై పోటీలు ఉంటాయని వివరించారు. అన్ని పోటీలకు ప్రవేశం ఉచితమని, పాల్గొనే వారందరికీ ప్రశంసా పత్రాలు అందజేస్తామని చెప్పారు. పూర్తి వివరాలకు ప్రతినిధి బలరామ్ కృష్ణను 91541 70108లో సంప్రదించాలని నిర్వాహకులు కోరారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడి దుర్మరణం

పీఎం పాలెం: జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఓ యువకుడు ఘటనా స్థలిలోనే దుర్మరణం చెందాడు. శనివారం అర్ధరాత్రి 2 గంటల సమయంలో జరిగిన ఈ ప్రమాదానికి సంబంధించి పీఎం పాలెం పోలీస్ స్టేషన్ సీఐ వై.వెంకటరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కొమ్మాది కార్పెంటర్ కాలనీలో నివసిస్తున్న గారి వెంకటరావుకు ఇద్దరు కుమారులు కాగా చిన్న కుమారుడు ప్రసాదు (28) అవివాహితుడు. కారు డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. తన బైక్‌పై శనివారం సాయంత్రం ఆనందపురం మండలం పెద్దిపాలెం వివాహానికి వెళ్లాడు. రాత్రి 2 గంటల సమయంలో తిరిగి వస్తూ... కొమ్మాది కూడలిలో మారికవలస వైపునకు యూ టర్న్ తీసుకుంటుండగా నగరం వైపు నుంచి ఆనందపురం వైపునకు వెళ్తున్న గుర్తు తెలియని భారీ వాహనం ఢీకొట్టడంతో తీవ్ర గాయాలపాలైన ప్రసాదు సంఘటన స్థలంలోనే మరణించాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. మృతుని అన్నయ్య శ్రీను ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

'శంకర్ ఫౌండేషన్'కు లోటస్ అవార్డు

సింహాచలం : జీవీఎంసీ 93వ వార్డు పరిధి నాయుడు తోటలోని శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రికి 2023 సంవత్సరానికిగాను లోటస్ అవార్డు లభించింది. మధ్యప్రదేశ్‌లోని నీముచ్‌లోని గోమాబాయ్ నేత్రాలయలో ఆదివారం జరిగిన 17వ వార్షిక సదస్సులో విజన్ 2020–దరైట్ సైట్ ఇండియా సీఈవో డాక్టర్ ఫణీంద్రబాబు ఈ అవార్డును అందజేశారు. కార్యక్రమంలో విజన్ 2020 అధ్యక్షుడు ఆర్ఎన్ మొహంతి పాల్గొన్నారు. ఆస్పత్రిలోని కమ్యూనిటీ ఆప్తమాలజీ విభాగానికి గాను ఈ అవార్డు లభించింది. శంకర్ ఫౌండేషన్ తరపున డీజీఎం కేవీవీ రమేష్‌కుమార్, ఏజీఎం కేవీ వేణుగోపాల్, సీనియర్ మేనేజర్ అప్పలరాజు అందుకున్నారు. అలాగే రూ.50 వేలు బహుమతి కూడా అందుకున్నారు. అవార్డు రావడంపై శంకర్ ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ ట్రస్టీలు ఎ.విజయ్ కుమార్, ఎ.కృష్ణకుమార్ ఆనందం వ్యక్తం చేశారు.


అవార్డు అందుకుంటున్న శంకర్ ఫౌండేషన్ డీజీఎం రమేష్‌కుమార్

927వ రోజుకు చేరుకున్న ఉక్కు దీక్షలు

కూర్మన్నపాలెం : ప్రపంచంలోనే మహోన్నతమైన భారత రాజ్యాంగాన్ని కేంద్ర ప్రభుత్వం తూట్లు పొడుస్తూ ప్రభుత్వ రంగ సంస్థలను కారుచౌకగా ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టాలని చూస్తోందని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు విమర్శించారు. కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ రక్షణకు చేపట్టిన రిలే దీక్షలు ఆదివారం నాటికి 927వ రోజుకు చేరుకున్నాయి. పలువురు కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రభుత్వ రంగంలో కొనసాగించే వరకు కార్మికుల ఉద్యమం ఆగదన్నారు. కార్యక్రమంలో ఉక్కు పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

ఉత్కంఠగా క్రీడా పోటీలు


కబడ్డీలో తలపడుతున్న విద్యార్థులు

గాజువాక : జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని కల్చర్ ఫౌండేషన్, విశాఖ సౌత్ రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు క్రీడా పోటీలు ప్రారంభమయ్యాయి. గాజువాక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో బాలురకు కబడ్డీ, వాలీబాల్, బాలికలకు కబడ్డీ, త్రోబాల్ పోటీలు, బాల బాలికలకు 200 మీటర్ల పరుగు పందెం పోటీలను ఏర్పాటు చేశారు. ఈ పోటీలను గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశనుంచే క్రీడలపట్ల ప్రతి ఒక్కరూ ఆసక్తి కలిగి ఉండాలన్నారు. ప్రతి ఒక్కరూ తమ ప్రాంతానికి, దేశానికి కీర్తి ప్రతిష్ఠలు తేవడానికి క్రీడలు మంచి సాధనమని అన్నారు. మూడు రోజులపాటు నిర్వహించనున్న ఈ పోటీల్లో గాజువాక, విశాఖ వెస్ట్, పరవాడ, అనకాపల్లి ప్రాంతాలనుంచి వెయ్యి మంది విద్యార్థులు పాల్గొంటున్నట్టు నిర్వాహకుడు పేర్ల అప్పారావు తెలిపారు. విజేతలకు ఈనెల 29న బహుమతులను ప్రదానం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి, 67వ వార్డు కార్పొరేట ర పల్లా శ్రీనివాసరావు, గాజువాక హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు కె.విజయ ప్రశాంతి, స్థానిక నాయకులు పల్లా చినతల్లి, చిక్కా సత్యనారాయణ, నిర్వాహకులు ఉమా మహేశ్వరరెడ్డి, గోకా దాసుబాబు, గిరి చరణ్ నాయుడు, శివ ప్రసాద్, పల్లేటి తాతారావు, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉత్సాహంగా పోటీలు


పోటీల్లో పాల్గొన్న చిన్నారులు

కొమ్మాది: వచ్చేనెల 6 నుంచి 8 వరకు బీచ్‌రోడ్డు సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో శ్రీ కృష్ణాష్టమి వేడుకలను పురస్కరించుకుని ఆదివారం ఇక్కడి విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించారు. వ్యాసరచన, డ్రాయింగ్, కృష్ణలీలలపై పరీక్ష, భగవద్గీత శ్లోక పారాయణ, వంట, పూల అలంకరణ, రంగోలీ వంటి పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు. విజేతలకు శ్రీకృష్ణాష్టమి రోజున బహుమతులు అందజేస్తామని ఇస్కాన్ అధ్యక్షులు సాంబదాస్ ప్రభూజీ, మాతాజీ నితాయి సేవిని తెలిపారు.